# ఇరాక్ మహిళకు ప్లాస్టిక్ సర్జరీ

## ఘనత సాధించిన అపోలో డాక్టర్లు

బంజారాహిల్స్, మే 11 (కెఎన్ఎన్): ఇరాక్‌లో ఈ మధ్య జరిగిన బాంబుపేలుళ్లలో సోఫియా మొహియుద్దీన్ (36) అనే మహిళకు ముఖం కుడి భాగంపై తీవ్ర గాయాలు అయ్యాయి. అయితే ఆమె జోర్డాన్ దేశంలో చికిత్స పొందినా కూడా ముఖంపై గాయాలు నయం కాలేదు. దీంతో ఆమె కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిని సందర్శించి తన గాయాలకు తగిన చికిత్సను నిర్వహించాలని కోరారు. అపోలో ఆసుపత్రి డాక్టర్ దేవరాజ్‌శోమ్ ఈ మహిళ చికిత్స కోసం సిటి స్కాన్ చేశారు. దీనిలో ఆమె ముఖం సగ భాగం 9 భాగాలుగా విరిగిపోయినట్లుగా ఉండడాన్ని గమనించి మహిళకు తెలిపారు. అనంతరం ఆమె డాక్టర్‌ను సంప్రదించి తనకు ఎలాగైన సర్జరీ చేసి తన ముఖాన్ని యధాస్థితికి తీసుకురావాలని డాక్టర్లను కోరింది. దీనికోసం ఎంత డబ్బు ఖర్చైనా సరే అని వెచ్చించడానికి సిద్దమని తెలిపింది. దీంతో అపోలో డాక్టర్ దేవరాజ్‌శోమ్ అధ్వర్యంలోని వైద్య బృందం 9 గంటల పాటు కష్టపడి ఆమెకు చికిత్సను నిర్వహించారు. ప్లాస్టిక్ సర్జరీ ద్వారా ఆమె ముఖం గాయాలను నయం చేశారు. ప్రస్తుతం సోఫియామొహియుద్దీన్ క్షేమంగానే ఉన్నట్లు అపోలో డాక్టర్లు తెలిపారు. ఇతర దేశాల కంటే మనదేశంలో 15 రెట్లు తక్కువ ఖర్చు అయ్యిందని అపోలో డాక్టర్ తెలిపారు. ఇరాక్ బాంబు పేలుళ్ల బాధితురాలికి ప్లాస్టిక్ సర్జరీని నిర్వహించి అపోలో డాక్టర్లు ఘనతను చాటుకున్నారు.